చి'వరి'కి అన్నదాత పరేషాన్

- పీచు, పొట్ట దశలో మొక్కజొన్న, వరి
- చివరి తడి ఇస్తేనే పంటలు చేతికొచ్చేది
- మార్చి 31న నీటి విడుదల నిలిపివేత
- ఆందోళనలో రైతులు



ఫొటోలోని రైతు పేరు ఒగ్గు రామచంద్రం, జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామం. తనకు ఉన్న ఎకరం భూమితోపాటు మరో నాలుగెకరాలు కౌలు తీసుకొని డీబీఎం –18 కెనాల్ పరిధిలోని 4–ఎల్ కాలువ పరిధిలో నీటి విడుదలపై ఆధారపడి ఆరు తడి పంట మొక్కజొన్న సాగు చేశాడు. రూ.రెండులక్షల వరకు పెట్టుబడి పెట్టగా పంట చివరి దశకు చేరుకుంది. కానీ కెనాల్ నీటి విడుదల మార్చి 31 నిలిపి వేశారని, ఇంకో నీటి తడి ఇస్తేనే పంట చేతికొస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. లేదంటే పెట్టుబడితోపాటు కష్టం, పంట నష్టపోవాల్సిందేనని, చివరి నీటి తడి ఇచ్చి పంటను కాపాడాలని వేడుకుంటున్నాడు.



పొట్ట దశలో వరి



పీచుదశలో మొక్కజొన్న

జమ్మికుంట: వానాకాలంలో అధిక వర్షాలతో పత్తి పంట దిగుబడి రాక నష్టపోయిన రైతులు యాసంగిలో ఎన్నో ఆశలతో పలటలు సాగు చేశారు. కెనాల్ కింద వరితోపాటు ఆరుతడి మొక్కజొన్న తదితర పంటలు వేశారు. కానీ ఇప్పుడు రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు చివరి దశలో ఉండగా కెనాల్ నీటి విడుదల నిలిపేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటకు చివరి తడి అందకపోతే నష్టపోతామని వాపోతున్నారు. రెండు తడులు పంట పండినట్లేనని అంటున్నారు.

వారబందీతో నీటి విడుదల

యాసంగిలో ప్రభుత్వం ఆరుతడి పంటల సాగుకు జనవరి 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు నీటి విడుదల చేస్తామని షెడ్యూల్ విడుదల చేసింది. కానీ జనవరి 8వ తేదీ నుంచి నీరు విడుదల చేశారు. రైతులు వరితోపాటు మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. వారబందీతో మార్చి 31 వరకు నీటి విడుదల చేశారు. కానీ ఇప్పటి వరకు 5 దఫాలుగా నీటి విడుదల చేయగా మొక్కజొన్న పీచు, వరి పొట్ట దశలో ఉన్నాయి. పంటలకు కనీసం నాలుగు నెలల సమయం పడుతుందని రైతులు తెలుపుతున్నారు. పంటలకు కనీసం ఆరుతడులు ఇవ్వాల్సి ఉంది. పీచు, పొట్ట దశలో పంటలకు నీరు అందకపోతే నష్టపోతామని, చివరి తడి ఇస్తే దిగుబడి తగ్గిన పంట నష్టం నుంచి బయటపడుతామని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పంటల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని కెనాల్ ద్వారా నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో కెనాల్ కింద వరి 1,11,763 ఎకారాలు, మొక్కజొన్న 7,012 ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వానికి వ్యవసాయశాఖ అధికారులు పంటల కాల పరిమితి ప్రకారం నివేదిక అందించారా అనే సందేహం వస్తోంది. మొక్కజొన్న, వరికి కనీసం 100 రోజుల సమయం పడుతుందని, మూడు నెలలు, ఐదు దఫాలుగా వారబందీతో నీరు విడుదల చేస్తే పంట పూర్తవుతుందా అనే విషయం ఇట్టే తెలిసిపోతుంది. సాగుకు పూర్తి స్థాయిలో నీరు లేని పక్షంలో క్రాప్ హాలీడే ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి సూచించాలి. కానీ అలాంటి నివేదిక ఇవ్వకపోవడంతో యాసంగికి సాగునీరు ఇస్తామని ప్రకటించడంతో ఆశతో రైతులు పంటలు సాగు చేశారు. పంటలకు భారీగా పెట్టుబడిపెట్టారు. చివరి తడికోసం ఎదురుచూస్తూ ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఎల్ఎండీ గేట్లు బంద్ చేశామంటున్నారు అధికారులు. నీటి విడుదలపై పలువురు రైతులు హుజూరాబాద్ ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా సాగునీరు ఇవ్వలేమని తెలిపారు.

పంటలు వేసుకోవద్దని చెప్పినా బాగుండు



కెనాల ద్వారా వచ్చే నీటితో రెండెకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. పంట ఇప్పుడు పీచు, కంకి దశలో ఉంది. చివరి తడి ఇవ్వకుంటే మొక్కజొన్న మొత్తం నాపకంకులు అవుతాయి. గింజలు రాకపోవడంతోపాటు పెట్టుబడి, పంట నష్టపోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వం పంటలు వేసుకోవద్దు ముందే చెప్పినా బాగుండు. ఇంకా రెండు నీటి తడులు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

– తడిగొప్పుల లింగయ్య, ఇల్లందకుంట

క్లుప్తంగా

కేంద్రమంత్రిని కలిసిన ముదిరాజ్‌లు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముదిరాజ్‌లు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామ ముదిరాజ్‌లు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లో కలిశారు. బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఐదేళ్లకోసారి జరిగే పెద్దమ్మతల్లి జాతరకు రావాలని ఆహ్వానించారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, ముదిరాజ్‌లు కోతి ఆంజనేయులు, చొక్కాల రాజ్‌కుమార్, బొజ్జ సంతోష్, గీకురు ఆంజనేయులు, చింతల రమేష్, జిర్ర ఆంజనేయులు, బొజ్జ శ్రీనివాస్, రవీందర్, సంపత్, కనకయ్య, చొక్కాల అమర్, బాలయ్య, కోతి సంపత్, రమేశ్, రాజేశం, కుమార్, జిర్ర సంపత్, జిట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మానకొండూర్: మండల కేంద్రంలోని తూర్పు దర్వాజ, పల్లెమీద నుంచి కరీంనగర్‌కు గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు, బస్‌షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వేసవిలో మరింత బాధలు భరించలేకపోతున్నారని బస్‌షెల్టర్లు నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు ఆర్టీసీ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బస్‌షెల్టర్లతో ప్రయాణికులకు ఇబ్బందులు తీరుతాయని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు. మడుపు ప్రేమ్‌కుమార్, కోండ్ర సురేష్, బుర్ర శ్రీధర్, డి. శ్రీనివాస్‌రెడ్డి, కె. రాకేష్, వెంకట్, వరహాల చారి తదితరులు ఉన్నారు.

రేషన్‌కార్డు సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

శంకరపట్నం: రేషన్‌కార్డుల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు మండంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం వినతిపత్రం అందించారు. ఇప్పటికే గ్రామాల్లో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు, రికార్డుల నిర్వహరణ, ఇతర పనులతో వీలుకాదని మొరపెట్టుకున్నారు. మంగళవారం నుంచి రేషన్‌కార్డుల సర్వే చేయాలని తహసీల్దార్ ఆదేశించారని, అధికభారం పడుతున్నందున మినహాయింపు ఇవ్వాలన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



శంకరపట్నం: కేశవపట్నంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు అనిల్ బీజేపీ జెండాను ఎగురవేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, రాములు, కొంరయ్య, నరేందర్, శ్రీనివాస్, జైపాల్, సాగర్, సారయ్య, సాయి, రాజిరెడ్డి, అశోక్,సంపత్, పాల్గొన్నారు.

'ఫీజు బకాయిల విడుదలకు ఎందుకింత నిర్లక్ష్యం'

కరీంనగర్: విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకింత నిర్లక్ష్యమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బద్దంఎల్లారెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూములను వేలం ద్వారా అమ్మే నిర్ణయాన్ని విద్యార్థుల పోరాటాలను చూసి అయినా ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో అప్రజాస్వామిక ఆంక్షల సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి, ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న ఆయా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, నగర కార్యదర్శి హేమంత్, నాయకులు సందీప్ రెడ్డి, అశోక్, పవన్, వినయ్ రెడ్డి, రాజేశ్ పాల్గొన్నారు.



దుమ్ముతో ఇబ్బందులు

మానకొండూర్: నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా దుమ్ముతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని ముంజంపల్లి శివారులోని జాలగుట్ట వద్ద పనులు జరుగుతున్నాయి. ప్రతిరోజు దుమ్ము లేవకుండా రహదారిపై ట్యాంకర్లతో నీరు చల్లాల్సి ఉండగా, ఒకటి, రెండుసార్లు అంతంత మాత్రంగానే నీరు పడుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దుమ్ము లేవకుండా ఎప్పటికప్పుడు నీరు చల్లాలని కోరుతున్నారు.

జాతీయస్థాయి హ్యాకథాన్‌లో 'జ్యోతిష్మతి' విద్యార్థుల ప్రతిభ



ప్రోత్సాహం అందిస్తున్న కళాశాల చైర్మన్ సాగర్‌రావు

తిమ్మాపూర్: జాతీయస్థాయి హ్యాకథాన్‌లో 'జ్యోతిష్మతి' విద్యార్థు ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు అన్నారు. జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లో ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కోహోరట్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో 92 జట్లతో పోటీపడి ప్రథమ స్థానంలో నిలిచారు. పంట వ్యాధులను గుర్తించడానికి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రాజెక్ట్ ఆల్ క్రాప్ కేర్ అనే ఏఐ ఆధారిత పరిష్కారాన్ని విద్యార్థులు అజిత్, అక్షిత్, రమేష్ (సీఎస్ఈ ఫైనలియర్) రూపొందించారు. కళాశాలకు కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చిన విద్యార్థులకు రూ.పదివేల ప్రోత్సాహం, ప్రశంస పత్రం అందించి అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు

బావుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలి

గన్నేరువరం: రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయబావుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర యువజన నాయకుడు సంపతి ఉదయ్‌కుమార్ తెలిపారు. గునుకులకొండాపూర్ రోడ్డు పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని, రోడ్డు పనులకు సంబంధించిన కాంట్రాక్టర్, అధికారులు బావులను గుర్తించి రైతులకు నష్టపరిహారం చెల్లించి బావులను పూడ్చివేయాలని లేదంటే రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామడుగు: మండలంలోని రంగసాయిపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సోమవారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కట్ట రవీందర్, శ్రీనివాసచారి, శేఖర్, లింగంపల్లి శ్రీనివాస్, నీలం రవి, బసవేని శేఖర్, కనకయ్య, సందీప్, శ్రీరామ్,మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

14న వేలం

గన్నేరువరం: ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయంలో అమ్మవారికి నిత్యం సమర్పించే ఒడిబియ్యం, చీరలు తదితర వాటికి ఈనెల 14న ఆలయంలో ఏడాదికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ. 50 వేల అడ్వాన్స్ చెల్లించాలని, టెండర్ దక్కించుకున్నవారు సగం డబ్బులను అదేరోజు చెల్లించాలని, ఆలయ నియమ నింబంధనలు వర్తిస్తాయని తెలిపారు.



శ్రీహనుమాన్ సేవా కమిటీ

రామడుగు: మండల కేంద్రంలో శ్రీహనుమాన్ సేవా నూతన కమిటీని సోమవారం స్వాములు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనకయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల రమేష్, కోశాధికారిగా జువ్వాజీ అజయ్, సభ్యులుగా బొజ్జ తిరుపతి, నీలం ప్రశాంత్, మాడిశెట్టి జయంత్, మండల లక్ష్మణ్, మూల వంశీ, పూరెల్ల రాహుల్, చిట్యాల కమలాకర్, శివకుమార్, శ్రీసాయి,కళ్యాణ్, కీర్తికుమార్, శ్రీనివాస్, అంజయ్య, మధు, ఆదిత్యరెడ్డి, రాజుకుమార్ ఎన్నికయ్యారు.

విద్యుత్ ప్రమాదంలో బాలుడికి గాయాలు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేటలో విద్యుత్ వైర్లు తగిలి బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గూల్ల సాయిచరణ్ (9) ఈ నెల 5వ తేదీన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా బాల్ ఓ వ్యక్తి ఇంటిపై పడింది. సాయిచరణ్‌తో పాటు మరో బాలుడు బాల్ తీసుకు రావడానికి ఇంటిపైకి ఎక్కగా పైనుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లు సాయిచరణ్‌కు తగిలాయి. ఎడమ, కుడిచేతికి తీవ్ర గాయాలు కావడంతో హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికత్స చేయిస్తుండగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లూజ్‌వైర్లు సరిచేయాలని గతంలో విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరోపించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి సాయిచరణ్‌కు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించాలని కోరారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభలను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: ఈనెల 10వ తేదీ నుంచి 14వరకు నిర్వహిస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతి సభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ అన్నారు. సోమవారం నగరంలోని ఎస్సారార్ కళాశాలలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో మతోన్మాద గుండాల దాడిలో అమరత్వం చెందిన జార్జిరెడ్డి సమాజంలో అందరికీ విద్య, వైద్యం, ఉపాధి రావాలని, సమసమాజం కావాలని కలలుగన్నారని అన్నారు. అందులో భాగంగానే ఉస్మానియా యూనివర్సిటీలో పేద విద్యార్థుల తరఫున పోరాటం చేశారని తెలిపారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కెంసారపు రవితేజ, నాయకులు కొయ్యడ బాబు, ఎండీ అస్లాం, తళ్లపల్లి రమేష్, నవీన్, రాజేశ్, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



శంకరపట్నం: రోగులతో మాట్లాడుతున్న వైద్యులు



రామడుగు: వైద్య సిబ్బందికి సన్మానం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి శ్రావణ్ అవగాహన కల్పించారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలు రోగులకు వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపి తాగాలని సూచించారు.అనంతరం మండలంలో టీబీతో బాధపడుతున్న వారికి పప్పు దినుసులు అందించారు.

రామడుగు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ యూత్ విభాగం మండల ఉపాధ్యక్షుడు బుదారపు కార్తిక్ ఆధ్వర్యంలో మండలంలోని గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య సిబ్బందిని సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వెంకట గ్రీష్మన్య, వెంకటేశ్వర్లు, కొలిపాక కమలాకర్, స్వామి, పురాణం రమేశ్, తిరుపతి, నరేందర్, శ్రీధర్, కొమురయ్య, శివశంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పి కొడతాం



మానకొండూర్: మాట్లాడుతున్న సంపత్ గౌడ్



చొప్పదండి: గుమ్లాపూర్‌లో పాదయాత్ర



జమ్మికుంటలో...

మానకొండూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొడతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొండపల్కల, గంగిపల్లి, వన్నారం, గ్రామాలలో జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. పార్టీ జెండా ఎగరవేసి ప్రతిజ్ఞ చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మేధావులను తక్కువ చేస్తోందని, ప్రభుత్వం అవలంబిస్తున్న కుట్రలను బయటపెట్టడానికి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు, ఉపాధ్యక్షులు తిరుమల్ రెడ్డి, నల్లగొండ రాములుగౌడ్,గట్టు తిరుపతి, మాడ తిరుపతిరెడ్డి, కొత్తిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, దూలం దేవేంద్ర, ముక్కెర సతీష్, బాకారపు శ్రీనివాస్, ఓదెలు పాల్గొన్నారు.

చొప్పదండి: బీజేపీ నాయకులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నట్లు ఉండటంతో ప్రజలను చైతన్య పరిచేందుకు పాదయాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఇంచార్జి పత్తి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గుమ్లాపూర్‌లో సోమవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పద్మాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మునిగాల రాజేందర్, కోలపురి శ్రీకాంత్, రాజేశం, తిరుపతిగౌడ్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని 17, 18, 19, 20 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, కరీంనగర్ కార్పొరేటర్ అశోక్‌రావు, పీసీసీ మెంబర్ బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి హాజరై ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అవమాన పరుస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా జైబాపు,జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తుందన్నారు. రాజ్యాంగ విలువలు,ప్రజల హక్కులను పరిరక్షించేందుకు, రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేసేందుకు పాదయాత్ర చేపట్టామన్నారు. మార్కెట్ కమిటీవైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ కోటి, మాజీ కౌన్సిలర్లు మల్లయ్య, వీరన్న, సదానందం, రాము, రాజు, పట్టణ మహిళాఅధ్యక్షురాలు రేణుక శివకుమార్‌గౌడ్, శ్రీహరి, రమేశ్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్, రామంచ గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, బాబాసాహేబ్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రచేస్తోందని ఆరోపించారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ భారతిదేవి, మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, నాయకులు వంటకాల సంపత్‌రెడ్డి, బోయిని వేణుగోపాల్, వంగర మల్లేశం, దొబ్బల తిరుపతి, పూదరి వేణుగోపాల్, కానవేని శివకుమార్, ఎనగందుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి



సన్మానిస్తున్న సీఐ ప్రకాశ్ గౌడ్, పోలీస్ సిబ్బంది

చొప్పదండి: చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న పర్శరాములు, రవీందర్‌కు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. సీఐ ప్రకాశ్ గౌడ్, ఎస్ఐ సురేందర్ బ్యాడ్జీలు అందించి అభినందించారు. పర్శరాములు మెదక్ జిల్లా, రవిందర్ కామారెడ్డి జిల్లాకు బదిలీ కావడంతో సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక



శంకర్‌ను సన్మానిస్తున్న స్థానికులు

చొప్పదండి: పట్టణానికి చెందిన ఎన్నం శంకర్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. నేత కార్మిక కుటుంబానికి చెందిన శంకర్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో స్థానికులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మునీందర్, రమేశ్, లింగన్న, కృష్ణ, రాజశేఖర్, ప్రశాంత్, శ్రీనివాస్, సమర్‌రెడ్డి, హరీశ్, సత్యం, మల్లేశ్, శివశంకర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేశ్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కోర్సులను కళాశాల ప్రిన్సిపల్ డా. రమేశ్ సోమవారం ప్రారంభించారు. శిక్షణ తరగతులు నెలరోజుల పాటు కొనసాగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదెల్‌కుమార్, కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, అధ్యాపకులు గణేశ్, శ్యామల, ఉమాకిరణ్, సుష్మ, రవిప్రకాశ్‌రావు, ఇ.రవి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. చిరిగిన భారీ ఫ్లెక్సీలు



నగరంలో సోమవారం రాత్రి ఈదురు గాలులు రావడంతో పలు చోట్ల భారీ హోర్డింగ్‌లపై ఉన్న ఫ్లెక్సీలు చిరిగి కిందపడ్డాయి. రహదారుల వెంట వెళ్తున్న ప్రయాణికులు, ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈదురుగాలు వీచే అకాశం ఉన్నందున నగరంలోని ఫ్లెక్సీలపై అధికారులు శ్రద్ధ పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్